సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 11 । నవంబర్ । 2024



అంతా మా ఇష్టం.!

ఇసుకాసురులు చెరువులో ఇసుక కోసం అడ్డుగా ఉన్న రూ. లక్షలు విలువ చేసే చెట్లను మాయం చేసిన సంఘటన పీలేరు మండలంలోని తరిగొండ గ్రామంలో జరిగింది. -8లో



వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

పెద్దమండ్యం మండలంలో పట్టపగలు జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 277 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 11వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

టర్కీ సదస్సులో ప్రసంగించిన ఎంపీ మిథున్‌రెడ్డి



టర్కీ సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు: టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన యూఎన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, క్లైమేట్ పార్లమెంట్ నిర్వహిస్తున్న సదస్సులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. 40 దేశాలకు పైగా పార్లమెంటేరియన్లు పాల్గొని అంతర్జాతీయ పర్యావరణం, వాతావరణ మార్పు అంశంపై ప్రసంగించారు. ఇందులో భారతీయ ప్రతినిధి బృందానికి ఎంపీ మిథున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు.

అటవీ అమరవీరుల దినోత్సవం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు

రాజంపేట: రాజంపేటలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అడవి జంతువులు, స్మగ్లర్ల చేతిలో ప్రాణాలు అర్పించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తా చాటిన జిల్లా వాసి



మెడల్స్ అందుకుంటున్న పూల నాగరాజు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రానికి చెందిన పూల నాగరాజు ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలో సత్తా చాటి పలు మెడల్స్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన సెవెన్త్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో 400 మంది దాకా పాల్గొనగా అన్నమయ్య జిల్లా నుంచి తాను బంగారం, సిల్వర్ తదితర నాలుగు మెడల్స్ సాధించానని నాగరాజు తెలిపారు.

తెలుగుకు వెలుగునిచ్చిన బ్రౌన్



సీపీ బ్రౌన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ తదితరులు


కడప కల్చరల్: తెలుగుభాషకు కొత్త వెలుగునిచ్చిన మహనీయుడు సీపీ బ్రౌన్ అని.. యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి కొనియాడారు. బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రౌన్‌లో పట్టుదల ఎక్కువని, కడపను కార్యస్థానంగా తెలుగు భాషను కాపాడుకున్న మహనీయుడని కొనియాడారు. తెలుగు ఉన్నంత వరకు తెలుగువారు ఆయనను మరువలేరన్నారు. ఆయన కీర్తిని విస్తృత పరిచేందుకు డిసెంబరు 12న భవన విస్తరణ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. విశిష్ట అతిథి డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ తెలుగుభాషోద్ధారకుడిగా బ్రౌన్ తెలుగు వారి హృదయాలలో శాశ్వత స్థానం సాధించారని తెలిపారు. వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి మాట్లాడారు. తొలుత బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య జి.పార్వతి బ్రౌన్ జీవితం గురించి క్లుప్తంగా వివరించారు. ప్రధాన వక్త స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ వేమనను ప్రపంచానికి పరిచయం చేసిన బ్రౌన్ తెలుగుకు కూడా శాశ్వతత్వం కల్పించారన్నారు. సాహితీవేత్త ఎస్ఆర్ ప్రసాద్‌రెడ్డిని నిర్వాహకులు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఎదురు చూపులేనా!

- డీఎస్సీ నిర్వహణపై మంత్రి హామీతో కదలిక వచ్చినా మళ్లీ స్తబ్దత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2025 మార్చి నాటికి 1266 ఖాళీల గుర్తింపు
- ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ 748, ఎస్‌ఏ 518 పోస్టులు ఖాళీ
- ఇప్పటికే విడుదలైన టెట్ ఫలితాలు
- కోచింగ్ సెంటర్లలో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు



విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు



కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ నిర్వహణపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల చేసిన ప్రకటనతో అధికారుల్లో కదలిక వచ్చినా తరువాత మళ్లీ స్తబ్దత నెలకొంది. ఈనెల 6వ తేదీ తర్వాత డీఎస్సీ నిర్వహణపై ప్రకటన వెలువడుతుందని అభ్యర్థులు ఆశగా ఎదురు చూశారు. ఇప్పటికీ ప్రకటన విడుదల కాకపోవడంతో వారి ఆశలు అడియాశలుగా మిగిలాయి. మళ్లీ అభ్యర్థులకు ఎదరుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టుల భర్తీకి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికలను కూడా ఉన్నతాధికారులకు పంపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. దీంతోపాటు మంత్రి లోకేష్ డీఎస్సీ నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఆ తర్వాత మళ్లీ ప్రకటనపై నోరుమెదపకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే అభ్యర్థులు నెలల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

విడుదలైన టెట్ ఫలితాలు..

అక్టోబర్ 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో జిల్లాలో కడప, ప్రొద్దుటూరు కలిపి 8 కేంద్రాల్లో టెట్ పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 23044 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారం క్రితం ఫలితాలు కూడా విడుదలయ్యాయి. డీఎస్సీ నిర్వహణపై కసరత్తు ప్రారంభం కావడంతో పాటు మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఆ తర్వాత ఎలాంటి ముందడుగు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో 2015 ఏప్రిల్ 30వ తేదీ వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేశారు. ఈ ప్రక్రియలో మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1195, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో 71 పోస్టులు వివిధ కేడర్లలో ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఇలా మొత్తంగా రెండు యాజమాన్యాల్లో కలిపి 1266 ఖాళీలు ఉన్నట్లు తేలింది. అయితే ప్రస్తుత డీఎస్సీకి సంబంధించి డిసెంబర్ చివరి వరకు ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. దీని ప్రకారం జిల్లాలో 700కు పైగా పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే విషయం త్వరలో విడుదల చేయనున్న నోటిఫికేషన్ ద్వారా తెలియనుంది.

నిబంధనల ప్రకారమే..



ఉన్నతాధికారులు సూచించిన నిబంధనల మేరకే ఖాళీల భర్తీకి కసరత్తు చేశాము. ఈ మేరకు నివేదికలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపాము. వారు పరిశీలించి ఖాళీల వివరాలను అవసరం మేరకు డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు. దానిని అనుసరించి ముందుకు సాగుతాము.

– మీనాక్షి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి
జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి సుప్రభాతంతో కార్యక్రమాలు మొదలవుతాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి 8గంటలకు హరికథా, 10 గంటలకు దీక్షా బంధన అలంకారోత్సవం, బుధవారం నిత్య పూజలు,హోమాలు, కలశమహోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. అలాగే అదేరోజు రాత్రి 8గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, గ్రామోత్సవం ఉంటాయని తెలిపారు.

- 14న గురువారం ఉదయం 9గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి మండల పూజ కార్యక్రమం, 12గంటలకు మహా నైవేద్యం పంపిణీ, సాయంత్రం కార్తిక సహస్ర దీపార్చన రాత్రికి హరికథ గ్రామోత్సవం ఉంటాయి.. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృప పొందాలని మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు.



దేవస్థానం సమీపంలోని పార్కులో ఉన్న బ్రహ్మంగారి శిలా విగ్రహం



బ్రహ్మంగారిమఠం

జన హితం కోసం తిరుమల పాదయాత్ర



పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్: ప్రజలంతా సుభిక్షంగా ఉండటం కోసమే ప్రతి ఏడాది తిరుమల పాదయాత్ర చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 22వ తిరుమల పాదయాత్ర పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం తాను ఎంతకష్టమైనా ఓర్చుకుంటానన్నారు. పాదయాత్ర ద్వారా తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందని, దీనిని తాను బలంగా విశ్వసించడమే కాక స్వయంగా తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, అరిగెల సౌమిత్రి, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, దాసరి పెంచలయ్య, దండు గోపి, జీవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

డిసెంబర్ 6న పాదయాత్ర ప్రారంభం

తాను చేపట్టనున్న 22వ తిరుమల పాదయాత్ర ఈ ఏడాది డిసెంబర్ 6న ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. 6వ తేదీ ఉదయం 8–30 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. వేలాది మంది భక్తులకు వేంకటేశ్వర స్వామి దర్శనం కల్పించే అవకాశం ప్రతి ఏడాది తనకు కలుగుతుండటం పూర్వజన్మ సుకృతమని ఆకేపాటి తెలిపారు.

టీడీపీ నేత.. అధికార దర్పం!

- మండల సమావేశంలో కొత్త సంప్రదాయం
- ఏ పదవి లేకున్నా టీడీపీ నేత సుగవాసి దర్జా
- జీ హుజూర్ అన్న అధికారులు



ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రగతి గురించి సుగవాసి బాలసుబ్రమణ్యంకు వివరిస్తున్న ఏఈ రాజేష్

రాజంపేట టౌన్: రాజంపేట ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి పాలైన సుగవాసి బాలసుబ్రమణ్యం కొత్త సంప్రదాయానికి తెరతీశారు. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి మండల సర్వసభ్య సమావేశంలో ఏ పదవి లేని వ్యక్తి సమావేశంలో పాల్గొన్న దాఖలాలు లేవు. అయితే తెలుగుదేశం పార్టీకి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు పంచాయితీరాజ్ చట్టం 159 సెక్షన్ దోహదపడింది. సమావేశంలో పాల్గొన్న బాలసుబ్రమణ్యం దర్జాగా అధికార దర్పాన్ని ప్రదర్శించారు. అధికారులు కూడా మండల పరిషత్ అధ్యక్షుడు వెంకటనారాయణను లెక్కలోకి తీసుకోకుండా తమ శాఖల ప్రగతిని బాలసుబ్రమణ్యంకే వివరించడం విమర్శలకు తావిచ్చింది. మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వెంకటనారాయణను ఒకవైపు చివర కూర్చోపెట్టడం గమనార్హం. ఎంపీపీకి తన హోదాకు తగ్గట్టు కూర్చునే స్థానాన్ని కల్పించక పోగా చివరికి ఆయనతో మాట్లాడించకుండానే సమావేశానికి ముగింపు పలికారు. అయితే కొంత మంది పాత్రికేయులు ఎంపీపీ మాట్లాడాలని కోరగా అధికారులు ఆయనకు మైక్ ఇచ్చారు. మైక్ అందుకున్న ఆయన అందరికి నమస్కారం అంటూ రెండు ముక్కలతో తన ప్రసంగాన్ని ముగించారు.ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ప్రజలు సైతం విస్తు పోయారు.

మండల సమావేశంలో పలు తీర్మానాలు

మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా పలు తీర్మానాలను చేశారు. అందులో ప్రధానంగా జిల్లా కేంద్రంగా రాజంపేటను చేయాలని, రాజంపేటకు మెడికల్ కాలేజీ మంజూరు చేయాలని, పది టీఎంసీల సామర్థ్యంతో అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించాలన్న తీర్మానాలను ఆమోదించారు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

ఏ పదవి లేకున్నా మండల సర్వసభ్య సమావేశంలో సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొనడంపై ఎంపీడీఓ వరప్రసాద్‌ను అడగగా పంచాయితీరాజ్ చట్టం సెక్షన్ 159 ప్రకారం ఏదేని విషయంలో అనుభవం, విశేష పరిజ్ఞానం ఉండి ఏ రాజకీయ పార్టీలోను పదవిలేని కొందరు వ్యక్తులను ఆహ్వానించే అధికారం మండల పరిషత్ అధ్యక్షుడికి ఉందని తెలిపారు.

సంకల్ప దీక్ష.. విజయ కాంక్ష

- ఉత్సాహంగా ప్రారంభమైన అగ్నివీర్ ర్యాలీ
- పాల్గొన్న వివిధ జిల్లాల అభ్యర్థులు
- విజయకాంక్షతో లక్ష్యంవైపు అడుగులు: జేసీ అదితి సింగ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



మున్సిపల్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో భాగంగా పరుగు పోటీల్లో అభ్యర్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ ర్యాలీని ఆదివారం వేకువజామున 3 గంటలకు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్‌తో కలసి జెండా ఊపి మొదటి బ్యాచ్ పరుగు పందెం ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులు మొక్కవోని ఆత్మవిశ్వాసం.. సడలని పట్టుదలతో విజయమే లక్ష్యంగా సంకల్పం బూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ద్వారా దేశ సైన్యంలో చేరేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటికే రాతపరీక్ష పూర్తయిన అభ్యర్థులకు ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు విజయకాంక్షతో కృతనిశ్చయంతో ముందడుగు వేయాలన్నారు. ఎంపికల ప్రక్రియ పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి భద్రతనిచ్చే, సేవచేసే అవకాశం సైన్యం ద్వారా లభిస్తుందన్నారు. ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి భారతసైన్యంలో మీరు ఒకరుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలను ప్రారంభించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు మెడికల్, ఫిజికల్ టెస్టులు నిర్వహించారు. ఇందులో భాగంగా పరుగు పందెం, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, 9 అడుగుల కందం లాంగ్‌జంప్, హైజంప్, బీమ్ పుల్లప్స్ వంటి ఫిజికల్ టెస్టులు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభ్యర్థులకు వసతి సౌకర్యం కల్పించారు. కాగా ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ 800 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ ఎంపికలకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలబడిన అభ్యర్థులు



అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



లాంగ్‌జంప్ చేస్తూ..



జిగ్‌జాగ్ బ్యాలన్స్ చేస్తున్న అభ్యర్థులు

క్లుప్తంగా

యువతి అదృశ్యం

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన రమేష్, షాహీనా దంపతుల కుమార్తె సానియా(18) స్థానికంగా ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి వద్ద నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి షాహీనా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ అన్సర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేనల్లుడిపై కత్తితో దాడి



గాయపడిన ఖలీల్‌బాషా

మదనపల్లె : మేనల్లుడిపై మేనమామ కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ సోమలగడ్డకు చెందిన షాజహాన్‌బాషా కుమారుడు షేక్ ఖలీల్‌బాషా(28)పై అతడి మేనమామ బాబా ఇమామ్‌ఖాసీం కత్తితో దాడి చేశాడు. ఖలీల్‌బాషా తల్లి చాంద్‌బేగంకు స్థానికంగా రెండుసెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం విషయమై ఖలీల్‌బాషా తండ్రి షాజహాన్‌బాషా, మేనమామ బాబా ఇమామ్‌ఖాసీంల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఖలీల్‌బాషా ఇంటిముందు మరో స్నేహితుడితో కలిసి ఉండగా, బాబా ఇమామ్‌ఖాసీం ఒక్కసారిగా అతడిపై కత్తితో దాడికి పాల్పడి గొంతుపై పొడిచాడు. వెంటనే స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. దాడిలో ఖలీల్‌బాషా తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రాజంపేటలో హోటళ్ల తనిఖీ


రాజంపేట : రాజంపేటలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. 27 హోటళ్లలో తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీలు జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ కె షమీం, ఆహార భద్రత అధికారులు కె ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ పి సీతారామయ్యలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ షమీం మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 చట్టం నిర్దేశించిన ఫుడ్ లైసెన్సు నోటీసులు జారీ చేస్తామన్నారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలలో రంగులు ఉపయోగించరాదన్నారు. డీప్ ఫ్రైయింగ్ కోసం వాడే వంట నూనెను రెండు లేక మూడుసార్లు మాత్రమే వాడాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందజేయాల్సి ఉంటుందన్నారు.

వ్యక్తిపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాల సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు ఇచ్చి ఉంటాడనే అనుమానంతో సూలం శివరాముడుపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తిమ్మయ్య కాలనీకి చెందిన శివరాముడు గతంలో 5వ వార్డులోని 22వ రేషన్ డీలర్‌గా ఉండేవాడు. రెండు నెలల కిందట అతన్ని డీలర్‌గా తొలగించారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ సమాచారాన్ని శివరాముడు ఇచ్చి ఉంటాడనే అనుమానంతో పట్టణంలోని మద్దూరు నాగేంద్ర, సంజీవ మరికొందరు వ్యక్తులు కలిసి ఆదివారం సాయంత్రం దాడి చేశారని అతను త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

అంతా మా ఇష్టం..!

- బరి తెగించిన ఇసుకాసురులు
- చెరువులో ఇసుకను జేసీబీలతో తోడేసిన వైనం
- అడ్డంగా ఉన్న చెట్లు నరికివేత





రామానాయిని చెరువులో నీలగిరి, నల్లతుమ్మ చెట్లను పెకలించి వేసిన దృశ్యం

గుర్రంకొండ : 'అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగే వారే లేరు' అన్న చందంగా ఇసుకాసురులు వ్యవహరిస్తున్నారు. ఇసుక కోసం వారు ఎంతకైనా తెగిస్తున్నారు. చెరువులో ఇసుక కోసం అడ్డుగా ఉన్న చెట్లను సైతం జేసీబీలతో పెకలించేశారు. రూ. లక్షల విలువ చేసే చెట్లను మాయం చేసిన సంఘటన మండలంలోని తరిగొండ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో రామానాయిని చెరువు విస్తరించి ఉంది. మండలంలో ఇది అతిపెద్ద ఇరిగేషన్ చెరువు. ఈ చెరువు నిండి మొరవపోతే శ్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం వైభవంగా చెరువు వద్ద నిర్వహిస్తారు. అంతటి ప్రశస్త్యమున్న చెరువు.. ఇసుకాసురుల అక్రమ సంపాదనకు ఆవాసంగా మారింది. ఓ వైపు వందలాది లోడ్ల ఇసుకను ఇప్పటికే అక్రమంగా తరలించుకు పోయారు. చెరువులో ఉన్న చెట్లపై కూడా వారి కన్ను పడింది. చెరువులోని సువిశాలమైన ప్రాంతంలో పురాతన నల్లతుమ్మ, నీలగిరి చెట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి మధ్యలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ఇసుకాసురులు ఇసుక తోడేందుకు అడ్డుగా ఉన్న నల్లతుమ్మ, నీలగిరి చెట్లను జేసీబీలతో పెకలించి వేశారు. చెరువులోనే మరికొన్ని చోట్ల ఇసుకను తరలించడానికి గాను కొత్త దారుల ఏర్పాటు కోసం.. చెట్లను జేసీబీలతో పెకలించి పక్కన పడేశారు. ఎంతో పురాతనమైన చెట్లు కావడంతో కొంత మంది ఇసుకాసురులు వీటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బట్టీల యాజమానులకు సుమారు లక్ష విలువ చేసే నల్లతుమ్మ, నీలగిరి చెట్లను ఇప్పటికే విక్రయించినట్లు వారు పేర్కొన్నారు. మరికొన్ని చెట్లను వేళ్లతో సహా పెకలించి చెరువులోనే అలాగే వదిలిపెట్టేశారు. చెరువులో ఎక్కడ చూసినా నేలకొరిగిన చెట్లే కనిపిస్తుండటం గమనార్హం. ఓ వైపు ఇసుక, మరోవైపు చెట్లను అక్రమంగా విక్రయిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి ఎంతో విలువైన వృక్ష సంపదను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. చెరువును కాపాడుకొనేందుకు ఇప్పటికే వీఆర్వో, వీఆర్‌ఏలను అక్కడ కాపలాగా ఉంచామన్నారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

కలకడ : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి మండలంలోని నవాబుపేట పెద్దచెరువులో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు.. ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఆంజినేయులు జేసీబీతో నవాబుపేట గ్రామానికి చెందిన పద్మనాభనాయుడు, గుర్రంకొండ మండలానికి చెందిన జయచంద్ర, సుధాకర ట్రాక్టర్లలో ఇసుకను నింపుతుండగా పట్టుకున్నారు. ఆ వాహనాలు, జేసీబీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదివారం తెలిపారు.



సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

చెరువు వద్ద పోలీస్ బందోబస్తు



రామానాయిని చెరువు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

గుర్రంకొండ : ఇసుకాసురుల నుంచి కాపాడుకునేందుకు చెరువుల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. మండల పరిధి తరిగొండ గ్రామంలోని రామానాయిని చెరువు, మర్రిపాడులోని హరిహరాదుల చెరువులో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరిగింది. 15 రోజులుగా జేసీబీలతో వందలాది లోడ్ల ఇసుకను కొంత మంది ఇసుకాసురులు బయటి మండలాలకు అక్రమంగా తరలించేశారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ రూ.3300 చొప్పున విక్రయించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న ‘సాక్షి’లో.. చెరువును తోడేస్తున్న ఇసుకాసురులు అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఓ వైపు రెవెన్యూ అధికారులు, మరోవైపు పోలీసులు సదరు చెరువుల వద్ద విస్తృతంగా పర్యటించారు. అక్కడికి ఇసుకాసురులు రాకుండా చర్యలు చేపట్టారు. జేసీబీలు చెరువుల్లో కనిపిస్తే వెంటనే సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువుల వద్ద పోలీస్ బందోబస్తును ఎస్‌ఐ మధురామచంద్రుడు ఏర్పాటు చేశారు. మరోవైపు పోలీసు బృందం గస్తీ చర్యలు ముమ్మరం చేసింది. చెరువుల వద్ద వాహనాల్లో పోలీసులు సంచరిస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బయటి మండలాలకు చెందిన ట్రాక్టర్లు గానీ, అనుమానిత వ్యక్తులు గానీ ట్రాక్టర్లతో చెరువుల్లోకి ప్రవేశించినా పోలీసులు అడ్డుకొని వెనక్కు పంపించి వేస్తున్నారు. ఇళ్ల అవసరాల కోసం ఎవరైనా ఇసుకను మనుషుల ద్వారా ట్రాక్టర్లకు లోడ్ చేసుకొని తీసుకు పోవచ్చన్నారు. బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు గానీ, ఇసుకాసురులు గానీ జేసీబీలతో చెరువుల్లోకి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తున్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరికి స్వల్ప గాయాలు



కిరణ్‌కుమార్ (ఫైల్)

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో కడప-చెన్నై ప్రధాన రహదారిపై ఆదివారం రెండు బైక్‌లను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలంలోని వడ్డివారిపల్లె గ్రామానికి చెందిన రెండు బైక్‌లలో నలుగురు అయ్యప్పస్వామి మాలధరించిన భక్తులు కనమలోపల్లె గ్రామ సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్నారు. వారి బైక్‌లు భాకరాపేట దాటుకొని రాజస్తాన్ డాబా సమీపంలోకి రాగానే.. కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అయ్యప్ప మాల ధరించిన తిరుమల కొండ కిరణ్‌కుమార్(17), బత్తల శేషాద్రి తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరువాత వెనుక వస్తున్న బైక్‌ను కూడా ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న అయ్యప్పస్వామి భక్తులు వర్ధన్, బాలుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతి చెందాడని, శేషాద్రిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

- తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు
- సిబ్బంది కొరతతో పోలీసులకు సవాల్‌గా మారిన వైనం



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలను పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దమండ్యం : మండలంలో పట్టపగలు జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్తుండటంతో.. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. అసలే సిబ్బంది కొరతతో పోలీసులకు సవాల్‌గా మారింది. ఇటీవల మూడు పల్లెల్లో ఐదు ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడటంతో.. రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలలో దొంగలు జల్సాగా వచ్చి.. టార్గెట్ చేసిన ఇళ్లలో నగదు, నగలు దోచుకొని వెళ్తున్నారు. వివరాలలోకి వెళితే.. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ పసలవాండ్లపల్లెలో ఆగస్టులో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తోంది. పొలం పనులకు వెళ్లగా ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి 10 గ్రాముల బంగారం దోచుకొని పోయారు. ఇదే గ్రామానికి చెందిన శంకరాచారి ఇంటి తాళాలు పగలగొట్టి 40 గ్రాముల బంగారం అపహరించారు. సెప్టెంబరులో ఇదే పంచాయతీలోని ధనరాజుగారిపల్లెలో శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడ్డారు. ఇతను గొర్రెల పోషణ కోసం వెళ్లగా, భార్య టమాట పనులు చేయడానికి ఆటోలో కూలికి వెళ్లింది. ఈ ఇంట్లో కొంత నగదు, నగలు దోచుకెళ్లారు. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తుస్సావారిపల్లెలో శుక్రవారం తాళాలు వేసిన రెండు ఇళ్లలో పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మల్లమ్మ ఇంట్లో రూ.1.80 లక్షల నగదు దోచుకెళ్లారు. అలాగే పల్లెకు సమీపంలోనే నివాసం ఉన్న కొండారెడ్డి ఇంటిలో రూ.1 లక్ష నగదు, 12 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. మండలంలో జరుగుతున్న వరుస చోరీలపై పోలీసులు నిఘా ఉంచి, దొంగలను పట్టుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

జీతాలకు ఎఫ్‌ఆర్‌ఎస్ లింక్ సరికాదు



మాట్లాడుతున్న ప్రజా ఆరోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు

రాయచోటి (జగదాంబసెంటర్) : ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు విధానాన్ని ఉద్యోగుల జీతాలకు లింక్ చేయడం సరికాదని ప్రజా ఆరోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణం పీసీఆర్ లాడ్జిలో ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఉన్నత నాయకత్వ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ నుంచి క్షేత్రస్థాయి సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో ఉన్న లోపాలను సరిచేయకుండానే ఆ విధానంతో జీతాలలో కోత విధించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రపురెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి శివయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కోశాధికారి బాబాసాహెబ్, సుధాకర్‌రాజు, విజయవర్ధన్‌బాబు, వై.విశ్వనాథరెడ్డి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్బ.. ఎంత పెద్ద చేప !



రామసముద్రం : రామసముద్రం మండలంలోని ఊలపాడు చెరువులో 17 కిలోల చేప చిక్కింది. వారం క్రితం కురిసిన వర్షానికి చెరువులోనికి కొత్త నీరు రావడంతో గ్రామంలోని కొందరు యువకులు చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టేందుకు అమీర్‌బాషా అనే వ్యక్తి వలవేశాడు. వలలో ఒక పెద్ద చేప చిక్కుకుంది. చేపను తూకం వేయగా 17 కిలోల బరువు ఉన్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడు ఇంత పెద్ద చేప వలలో చిక్కలేదన్నారు. ఈ పెద్ద చేపను చూసేందుకు జనం ఎగబడ్డారు.

వాటర్‌గండిలో మునిగి వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్/వల్లూరు (చెన్నూరు) : కడప నగర శివారులోని వాటర్ గండిలో మునిగి ఒక వ్యక్తి మృతి చెందినట్లు చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగరం తిలక్‌నగర్‌లో ఉంటున్న బిల్లపాటి బాబు, తన సమీప బంధువు రవికుమార్‌తో కలిసి విహారయాత్రలో భాగంగా వాటర్ గండి ప్రాంతానికి వెళ్లడం జరిగింది. భోజనం అనంతరం ఈత కొడుతూ బిల్లపాటి బాబు పెన్నా నది ప్రవాహానికి మునిగి మృతి చెందాడు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా రేవూరు గ్రామానికి చెందిన మృతుడు బిల్లపాటి బాబు ఉపాధి నిమిత్తం కడపకు వచ్చి బంధువుల ఇంటిలో ఉంటున్నట్లు సమాచారం. ఈ మేరకు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బకాయిల చెల్లింపులో జాప్యం తగదు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు అన్నారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు నెలల లోపల పూర్తి స్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలైనా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం తగదన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఓ మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మీదేవి(45) ఇంటి వద్ద మరుగుదొడ్డిలో మోటార్ వేసుకుని నీరు పట్టుకుంటుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగులుకుని విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమె పడిపోయి ఉండటాన్ని గుర్తించిన అత్త ఓబుళమ్మ లేపేందుకు ప్రయత్నించగా.. ఈ సంఘటన గమనించిన కుమారుడు రామోహన్ స్విచ్ ఆఫ్ చేయడంతో ఓబుళమ్మ ప్రాణాలతో బయట పడగా, అప్పటికే లక్ష్మీదేవి మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

కాలం చెల్లిన సిరప్‌తో బాలుడికి అస్వస్థత

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది రోగులకు కాలం చెల్లిన మందులు ఇస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన జీతేష్‌కుమార్ అనే నాలుగేళ్ల బాలుడికి కాలం చెల్లిన సిరప్ ఇవ్వడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన శివానంద కుమారుడైన జీతేష్‌కుమార్‌కు జలుబు, దగ్గు ఉండటంతో శనివారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడికి క్లోరోఫెనిరమైన్ అనే సిరప్ రాసిచ్చారు. సిరప్‌ను ఆసుపత్రి ఆవరణలోని మందుల షాపులో తీసుకుని ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడికి తాపించారు. కొద్దిసేపటికి బాలుడికి చెమటలు పోయడంతోపాటు వాంతులు కావడంతో వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చిన సిరప్‌పై అనుమానం రావడంతో పరిశీలించిన తల్లిదండ్రులు.. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే కాలం చెల్లిన సిరప్‌గా గుర్తించారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించేందుకు తిరిగి ఆదివారం ఉదయం మళ్లీ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోగా.. మళ్లీ కాలం చెల్లిన సిరప్‌నే ఇచ్చారు. దీంతో సిబ్బందికి విషయం తెలిపి వారిపై బాలుడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు.

యువ ఉత్సవాల్లో ప్రతిభ చాటాలి

– పోస్టర్లు ఆవిష్కరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : యువ ఉత్సవాలలో ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా యువత ప్రతిభ చాటాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని తన నివాసంలో ఈ నెల 16న జరిగే యువ ఉత్సవ్- 2024 పోస్టర్లను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ నెహ్రూ యువ కేంద్రం సేవలు, కార్యక్రమాలను వివరించారు. ఈ ఉత్సవాలలో పెయింటింగ్, కవితవ్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాలలో ఉపన్యాస పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ మేళా సింగిల్ గ్రూప్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయికి పంపుతామన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ఉంటాయన్నారు. 15 ఏళ్లు నిండిన యువత పేర్లు నమోదు చేసుకోవాలనుకునే వారు 9177616677 అనే ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది సుబ్బారావు, సుబ్బయ్య, అరవింద్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

సత్తెనపల్లి : రాష్ట్రస్థాయి అండర్ -19 ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్లు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. బాలికల విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

గుంటిమడుగులో ఉద్రిక్తత

- టీడీపీ వర్గీయుల బ్యానర్ చించారంటూ వైఎస్సార్‌సీపీ వారిపై దాడి
- మా అనుమతి లేనిదే అభివృద్ధి కార్యక్రమాలు ఏ చేపట్టరాదంటూ దళితులపై ఆగ్రహం
- టీడీపీ నాయకులు చెప్పిందే వేదంగా వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు



పోలీస్‌స్టేషన్ ఎదుట గుంటిమడుగు గ్రామస్తుల నిరసన

రాయచోటి : రాయచోటి మండలంలోని గుంటిమడుగు గ్రామంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్‌ను చించి వేశారంటూ ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బండ బూతులు తిడుతూ రోడ్డెక్కారు. బ్యానర్‌ను తామెవ్వరూ చించలేదని, తమ పార్టీ వారిపై నిందలు వేయడం సరికాదని, అవసరమైతే దేవుని దగ్గర ప్రమాణం చేయడానికి సిద్ధమని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కె.రమణారెడ్డి, దేవనాథరెడ్డి, ఆంజనేయులు చెప్పినప్పటికీ టీడీపీ వారు వినలేదు. బ్యానర్‌తోపాటు గ్రామంలో తమ అనుమతి లేనిదే ఎలాంటి అభివృద్ధి పనులు చేయరాదని వాదనకు దిగారు. అంతేకాకుండా దళితవాడ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద కూడా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టరాదన్నారు. ప్రజలు ఇచ్చిన చందా డబ్బులతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని దళితులు చెప్పినా వారిపైన కూడా దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయంపై మాటలు పెరగడంతోపాటు ఒక్కసారిగా టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వారిపై దాడులకు తెగబడ్డారు. అదే స్థాయిలో గ్రామంలోని వైఎస్సార్‌సీపీ వారు కూడా రోడ్డు ఎక్కడంతో టీడీపీ నాయకులు రాయచోటి పోలీసులకు సమాచారం అందజేశారు. రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో గుంటిమడుగుకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంలో వైఎస్సార్‌సీపీ మహిళలపై కూడా లాఠీచార్జి చేశారు. అయితే టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ నాయకులు కన్నపు రమణారెడ్డి, కొక్కంటి దేవనాథరెడ్డి, గుంటిమడుగు ఆంజనేయులును అదుపులోకి తీసుకొని రాత్రి 9.30 గంటల సమయంలో రాయచోటి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తప్పుడు ఫిర్యాదులతో తమ వాళ్లను అరెస్టు చేసి తీసుకెళ్లడం మంచిది కాదని గ్రామస్తులు తిరగబడినా.. పోలీసులు లెక్క చేయకుండా వారి ముగ్గురిని వాహనంలోకి ఎక్కించుకున్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ అంత రాత్రివేళ గ్రామస్తులు రాయచోటి పోలీస్‌స్టేషన్‌కు వద్దకు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. విషయాన్ని పసిగట్టిన పోలీసులు గ్రామం నుంచి ఎవరూ బయటికి రారాదని గ్రామంలోని కొంత మందిని ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ వారికి హుకుం జారీ చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు

వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని గుంటుమడుగు గ్రామ ప్రజలు రాయచోటి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆదివారం రాత్రి రాయచోటి రూరల్ మండలం గుంటిమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కే రమణారెడ్డి, కే దేవనాథ్‌రెడ్డి, గుడ్డివడుగు ఆంజనేయులుతోపాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ నాయకులు చెప్పిందే వేదంగా.. ఎలాంటి విచారణ చేయకుండా అక్రమంగా అరెస్టు చేశారంటూ గ్రామస్తులు ట్రాక్టర్ల సాయంతో రాయచోటి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు గ్రామస్తులను లోపలికి రానివ్వకుండా రోడ్డుపైనే నిలబెట్టి వెళ్లిపోవాలని, లేకపోతే లాఠీచార్జి చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎలాంటి తప్పు చేయకపోయినా, అక్రమంగా అరెస్టు చేసిన వారిని బయటికు వదిలే వరకు తాము వెళ్లమని రోడ్డుపైనే నిరసన తెలుపుతూ నిల్చున్నారు.